# శతమానం భవతి

'నన్ను మళ్ళీ తిట్టేడు. ఇంక వాడిదగ్గర పని చెయ్యలేను!'

'తొందర పడబోక, ఏమని తిట్టాడూ?'

'వెధవా అని తిట్టేడు, ముండా అని తిట్టేడు. ఇంకా ఇంతకన్నా ఏమని తిట్టాలి?'

'ఇంతేనా తిడత? ఫరవాలేదు.'

'.........'

'ఫరవాలేదులే! అలా చూడకు.'

'అయితే యివన్నీ దులిపేసుకుని వాడిదగ్గరే పని చెయ్యమంటారా?'

'నిక్షేపంలాగ! తిట్టేడన్నమాటేగాని వాడికీ నీకూ మధ్య అంతకన్న ఏం జరిగింది, వెళ్లు: మామూలుగా పనికి వెళ్లు...'

'అలా వున్నావేం?' 'మళ్లీ చెడ తిట్టాడు పట్టుకుని.'

'ఈవేళ ఏమని తిట్టాడూ?'

'గాడిదన్నాడు, చేట పెయ్యన్నాడు, గుడ్లగూబలా చూస్తానన్నాడు.'

'ఇన్నిమాటలూ అన్నాడా?' 'ఇంతకన్న ఎక్కువే అన్నాడు.'

'అన్నాడు గదా! అయితే ఫరవాలేదు.' '.........'

'ఫరవాలేదోయి, మామూలుగా పనికి వెళ్లిపో రేపు.'

'ఇన్ని తిట్లూ తినా?'

'వెళ్లు. మరేం ఫరవాలేదు. వెళ్లు. అలా చూడక.'

'ఇంక వాడివద్ద పనిచేస్తే...' 'ఏం, ఏం?'

'పడతిట్టాడు పట్టుకుని!'

'ఈవేళానా?' 'రోజూకన్న ఎక్కువగా!'

'రోజూకన్న ఎక్కువగా తిట్టాడా?'

'ఒ! వీపు వాచిపోయేట్టు తిట్టేడు.'

'అయితే ఇంక ఫరవాలేదు.'

'ఏమిటి ఫరవాలేదు, మీ మొహం?'

'నీకే తెలుస్తుందిలే—'

'ఇంకా వాడిదగ్గరకు పనికి వెళ్ళమంటారా?'

'ఇదే అసలు నువ్వు వాడిదగ్గరనుంచి వృద్ధిలోకి రావలసినవిషయం-'

'.........'

'ఇంకొంచం నేర్పుగా ప్రవర్తించావంటే-?'

'ఛా! ఇంక నేర్పూలేదు, ఓర్పూలేదు. ఈవేళతో రాజీనామా...'

'వొద్దువొద్దు. చెడిపోతావు, వృద్ధిలోకి వస్తూన్నవాడివి...'

'ఏమటి వృద్ధి-తిట్లూ, శాసనార్థాలూనా?'

'వాటి అర్థం నీకు తెలీదు. కొద్దికాలంలోనే తెలుస్తుందిలే. రేపు మాత్రం పనికి వెళ్లాలి సుమా! మానేశావు గనక. నా సలహా విని ఎవడూ పాడుకాలేదు—'

'ఈవేళటివరకూ మీ సలహా పాటించాను. ఇంక నన్ను మొహమాటి పెట్టకండి—'

'ఏం? ఈవేళ ఏం జరిగిందేమిటీ?'

'నూరు తిట్లు తిట్టేడు, పేలేసి?'

'లెక్క పెట్టేవా? సరిగ్గా నూరూ తిట్టాడా?'

'తిట్టేడు—'

'ఇక నిన్ను విడవడు. నీకింక నిరుద్యోగసమస్య వదలిపోయింది—'

'మీమాటలు నాకు అర్థం కావడంలేదు'

'ఇంక నువ్వు వాడిదగ్గర స్థిరపడ్డావన్నమాట—'

'మీకు మతిపోయిందా? అలా పట్టుకు తిడుతూంటే వాడు నన్ను..'

'నీకింకా తెలిసి రావడంలేదు వాడితత్వం. నువ్వు చవటపెయ్యమ్మవయితే మొట్టమొదటిరోజునే ఒక్కతిట్టు తిట్టకుండానే అవతలకు పంపించేసి వుండేవాడు—'

'మరి ఈ తిట్లూ?'

'నూరువరకూ భరించగలిగే సమర్థత నీలో వుందో లేదో అతడు పరీక్షించేడు.'

'ఏమి వింత మాటలు!'

'నూరువరకూ భరించావు-పరీక్ష ప్యాసయ్యావు-ఇంక నిన్ను విడవడు!'